**కథ**

# గాలిలో కలం

**ఎలక్ట్రాన్**

**చిన్నగా పడ్తున్న చినుకుల్ని దూసుకొంటూ వచ్చి ఎక్స్‌ప్రెస్ బండి ప్లాట్‌ఫారం పక్కన ఆగింది. మొదటి తరగతి ఏ.సి.కోచ్‌లోంచి రాజశేఖరం కోచ్ అటెండెంట్ సహాయంతో, చంకకర్ర ఊతంతో బండి దిగాడు. అటెండెంట్ రాజశేఖరం సూట్‌కేసునీ, బ్రీఫ్‌కేసునీ కిందకి దించి ఓ నమస్కారం చేసి లోపలికి వెళ్ళిపోయాడు. తనని రిసీవ్ చేసుకోవడానికి రావల్సిన మనుషులు కనబడలేదు. కనుచూపుమేరలో ఎర్రబట్టలు కట్టిన పోర్టర్లూ కనిపించలేదు.**

పక్కపెట్టెలోంచి చేతి సంచితో దిగిన ఓ నడివయస్కుడు రాజశేఖరం పరిస్థితి గమనించి, ''కొద్దిసేపు ఓపికపట్టండి. నేనెవరైనా పోర్టర్‌ని వీల్‌ఛైర్‌తో పంపిస్తాను'' అని ముందుకుపోయాడు. చెన్నై హోటల్లో సెల్ మరిచిపోయినందుకు తన్ను తానే తిట్టుకొంటూ, చిన్నపాటి తుంపరలో తడుస్తూ నిల్చున్నాడు.

బండి వదిలి వెళ్ళిన అయిదు నిముషాలకి యిద్దరు పోర్టర్లు ప్రత్యక్షమయ్యారు. వీల్‌ఛైర్‌లో రాజశేఖరం స్టేషన్ మెయిన్ హాలు చేరుకొన్నాడు. తనకోసం రావల్సిన వాళ్ళు అక్కడా కనబడలేదు. రాజశేఖరం పర్సు తీసి పోర్టర్‌కి ఏభై నోటందించాడు. వాళ్ళెంతటుగా వాళ్ళు ఓ పదైనా తిరిగి యివ్వకపోతారా అని మనసులో అనుకొన్న రాజశేఖరానికి ఆశాభంగమే అయింది. అయినా బేరమాడే పరిస్థితి కాదు తనది. స్టేషను ఆవరణలో టాక్సీలుకానీ, ఆటోలు కానీ కనబడలేదు.

ఓ సైకిలురిక్షా అతను ''రిక్షా కావాలండీ అయ్యగారూ?'' అంటూ దగ్గరకు వచ్చాడు.

''టాక్సీస్టాండ్‌కి పోవాలి, ఎంత తీసుకొంటావు?'' గమ్యం చెప్పి, ప్రశ్నించాడు రాజశేఖరం.

''నిన్న సాయంత్రం ఓ ఆటోడ్రైవర్ని ట్రాఫిక్ పోలీసు దౌర్జన్యంగా కొట్టాడు. నిరసనగా ఈరోజు ఆటోడ్రైవర్లూ, అందుకు సానుభూతిగా టాక్సీడ్రైవర్లూ సమ్మె చేస్తున్నారు. మీరే ఊరు వెళ్ళాల్సినా బస్సులో పోవాల్సిందే. చెప్పండి, మీరెక్కవలసిన బస్సెక్కించి కూర్చోపెడ్తాను. ఇరవై రూపాయలిస్తారా?''

రిక్షా అతని మాటతీరు రాజశేఖరానికి నచ్చింది. పోర్టర్లకంటే యితనే నయమనుకొంటూ సరేనన్నాడు. రిక్షా అతను రాజశేఖరాన్ని జాగ్రత్తగా రిక్షా ఎక్కించి, సామాను కాళ్ళ ముందర సర్ది, బస్ కాంప్లెక్స్‌కి తీసుకుపోయాడు. కాంప్లెక్స్ గార్డ్ అరుస్తున్నా లెక్కచెయ్యక, రిక్షాని రాజశేఖరం ఎక్కవలసిన బస్సు దగ్గరగా ఆపాడు. బస్సు ఎక్కించి, సూట్‌కేసు సీటు పక్కగా పెట్టి, బ్రీఫ్‌కేసుని రాజశేఖరానికందించాడు. రాజశేఖరం ఏభై నోటందించాడు.

''చిల్లర లేదు బాబయ్యా, తీసుకొస్తాను'' అన్నాడు రిక్షా అతను.

పోర్టర్లు పడ్డ కష్టం కంటే యితను పడ్డ కష్టమే ఎక్కువనిపించింది రాజశేఖరానికి. ''పర్వాలేదు ఏభై ఉంచుకో'' అన్నాడు. రిక్షా అతను కృతజ్ఞతాపూర్వకంగా రెండు చేతులూ జోడించి నమస్కారం చేసి, మెరుపు కళ్ళతో బస్సు దిగాడు.

బస్సు బయలుదేరడానికింకా పది నిముషాల వ్యవధి ఉంది. రాజశేఖరం చంకకర్రని సీట్లకిందకు తోసి, ఎడమవైపుగా జరిగి కిటికీ పక్కన కూర్చున్నాడు. మరో రెండు నిముషాలుండగా ఓ పాతిక మంది యువకులు బిలబిలా వచ్చి బస్సులో కూర్చున్నారు. బయట తుంపరగా ఉన్నా బస్సులో ఉక్క మొదలైంది. పంచెకట్టుతో ఉన్న ఓ పల్లెటూరు ఆసామీ వచ్చి పక్కన కూర్చుంటూ, ''ఈ చిన్న పెట్టె మీదే అయితే ఒళ్ళోనైనా పెట్టుకోండి లేదా సీటుకిందైనా పెట్టండి'' అన్నాడు కాస్త గదమాయింపుగా. రాజశేఖరం దాన్ని తీసుకొని తన ఒళ్ళో ఉంచుకొన్నాడు. కాంప్లెక్స్ కంట్రోలర్ వచ్చి రెండు విజిల్స్ ఊదిన తర్వాత కండక్టరూ, డ్రైవరూ వచ్చారు. మరో నిముషంలో బస్సు కాంప్లెక్స్ వదిలి పరుగులు తీసింది. కిటికీలోంచి చిన్నపాటి తుంపరా, చల్లటిగాలీ తగలడంతో రాజశేఖరానికి చిన్నగా కునుకు రానారంభించింది. ఊరు వదిలి అయిదు కిలోమీటర్లు దాటగానే గత పుష్కరాలకి ఓ వెలుగు వెలిగి, ప్రస్తుతానికి గతుకులతో ఉన్న రోడ్డు తగిలింది. గతుకుల రోడ్డు మీద కుదుపుల ప్రయాణం ఆరంభం కాగానే రాజశేఖరం కంటి కునుకు కూడా కుంటి నడకలు నడవడం ప్రారంభించింది.

ఓ నలభై కిలోమీటర్లు ప్రయాణం జరిగేసరికి పొద్దువాలడం మొదలైంది. వర్షం ఆగింది. ఉన్నట్టుండి ఏ ఊరు లేనిచోట బస్సు ఆగింది. ''కొండల్లో కురిసిన భారీ వర్షం కారణంగా డొంకలవాగు రెండు రోజులుగా పొంగిపొరుతోంది. వాగు మీది వంతెన ఎంతోకాలంగా బాగులకు నోచుకోలేదు. పరిస్థితి అంతంత మాత్రం. మీరందరూ బస్సు దిగి, కాలినడకన వంతెన దాటండి. ఖాళీ బస్సుని వంతెన అవతలకి తీసుకు వచ్చిన తర్వాత, అందరూ తిరిగి ఎక్కవచ్చు'' అన్నాడు కండక్టరు అందరికీ వినబడేటట్టు.

''సామాన్ల సంగతి?'' ఎవరో ప్రశ్నించారు.

''వంతెనా, వంతెనతోబాటు బస్సూ కొట్టుకుపోతే ఈమధ్యనే ఈత నేర్చుకొన్న మా డ్రైవరు బతికి బయటపడవచ్చు. సామాన్లు కొట్టుకుపోవడమే తప్ప ఈతకొట్టిబయట పడలేవుగా! ఎవరి సామాన్లు వాళ్ళు తీసుకువెళ్ళకలిగితే అంతకు మించింది లేదు'' అన్నాడు కండక్టరు నవ్వుతూ.

బస్సులో చిరునవ్వుల జల్లులు కురిసాయి. కొందరు సామాన్లు తీసుకొనీ, మరికొందరు వదిలేసీ బస్సు దిగారు. ఎదురుగా పదడుగుల దూరంలో వంద అడుగులు పొడవుకల వంతెన కనబడింది. గట్లను తాసుకొంటూ, పరవళ్ళు తొక్కుతూ డొంకలవాగు ప్రవహిస్తోంది.


''గుంపుగా కాకుండా యిద్దరిద్దరు చొప్పున కాస్త కాస్త దూరంలో వెడ్తే బావుంటుందేమో?'' అన్నాడో యువకుడు.

''అందరి బరువూ కలిసి ఖాళీ బస్సు బరువులో ఆరోవంతు కూడా ఉండదు! బస్సు వెళ్ళగాలేంది మనకేమిటి భయం?'' అన్నాడు మరో అతను.

''తర్కం చేస్తూ కూర్చుంటే ఉన్న ఈకాస్త పొద్దు కూడా కొండచాటుకి పోతుంది. వెల్తురుండగానే వంతెన దాటడం మంచిది'' అన్నారెవరో.

ఆ మాటతో జనాల అడుగులు వంతెనవైపు దారి తీశాయి.

''కండక్టరు మాట విని మనందరం బస్సు దిగితే, ఆ పెద్దమనిషెవరో దర్జాగా కూర్చున్నాడు! యిది అన్యాయం!'' అన్నాడు నీలం గళ్ళ చొక్కా ధరించిన ఓ యువకుడు.



''పోన్లెద్దూ రామం! డ్రైవరు బరువుకి మరో మనిషి బస్సుకి అదనపు భారమైనంత మాత్రాన వంతెనకొచ్చే ప్రమాదం ఏమీ ఉండదు. ఎందుకొచ్చిన గొడవ, పోదాం పద'' అన్నాడు అతగాడి స్నేహితుడు.

''అలాకాదు, డ్రైవరు మినహా అందరూ దిగాల్సిందే!'' అంటూ, రామం అన్న ఆ యువకుడు బస్సెక్కి రాజశేఖరం వద్దకు వెళ్ళాడు. ''మీరు కండక్టర్ మాటలు వినలేదా? మేమందమూ వెర్రి పీనుగుల్లాగా బస్సు దిగితే, మీరు ఘరానాగా కూర్చోవడం పెద్దమనిషితనం అనిపించుకోదు! దిగండి'' అన్నాడు దురుసుగా.

రాజశేఖరానికి మనస్సు చివుక్కుమనిపించింది.

''నాకూ దిగాలనే ఉంది కాని, అశక్తత మూలాన సాధ్యం కాలేదు'' అన్నాడు నిర్లిప్తంగా.

''అశక్తతా, పాడా? దిగండి'' అన్నాడు రామం మరింత దురుసుగా.

రాజశేఖరం యిక తప్పదన్నట్టుగా నెమ్మదిగా వంగి, సీట్ల కిందుగా పెట్టిన చంకకర్ర తీసుకొని, కిటికీ దగ్గర్నుంచి సీటు చివరికి జరిగి, కర్ర ఊతంగా లేచి నిల్చున్నాడు. ఎడమకాలు తొడమధ్య భాగం నుంచీ వదులుగా వేలాడుతున్న ప్యాంటుని గమనించిన రామం ఒక్కసారిగా బిత్తరపోయాడు. దుడుకుతనంతో నోరు జారినందుకు సిగ్గుపడిపోయాడు. ''తెలియక ఏదో అన్నాను క్షమించండి. అయినా ఏదైనా జరిగితే డ్రైవరు తప్పించుకోగలడు కాని, మీకా అవకాశం లేదే?! మాలో ఎవర్నైనా సహాయం అడిగి ఉండొచ్చుగా?''


'ఒక పక్క క్షమార్పణలు చెబ్తూనే మరో పక్క మందలిస్తున్నాడు' అనుకొన్నాడు రాజశేఖరం. రామం చేయూతతో బస్సు దిగి, అతని సహాయంతోనే అడుగడుగూ నెమ్మదిగా వేసుకొంటూ రాజశే

ఖరం వంతెన దాటాడు. బస్సు కూడా వంతెన దాటి వచ్చిన తర్వాత, తిరిగి రామం సహాయంతో బస్సెక్కి, తన సీట్లో కూర్చుని కృతజ్ఞతలు తెలుపుకొన్నాడు. పల్లెటూరి ఆసామీ వచ్చి పక్కన కూర్చున్నాడు. అందరూ ఎక్కి సర్దుకొన్న తర్వాత బస్సు బయలుదేరింది. గమ్యం చేరుకొనేసరికి బాగా చీకటి పడిపోయింది. రాజశేఖరం బస్సులోంచి దిగి రిక్షా ఎక్కడానికి రామం మరోసారి చెయ్యి అందించాడు.

రహదారి బంగ్లాలో ఆ రాత్రికి విశ్రాంతి తీసుకొన్న రాజశేఖరానికి రామం పదే పదే గుర్తుకొచ్చాడు. రాత్రి పది గంటల ప్రాంతంలో ఆ మండల కార్యాలయాధికారి వచ్చి, హఠాత్తుగా పట్నంలో జరిగిన సమ్మె కారణంగా తను చేసిన టాక్సీ ఏర్పాట్లూ అవీ తలకిందులైపోయాయనీ, సమ్మె గురించి ఆయన్ని హెచ్చరిద్దామని సెల్ ఫోను రింగ్ చేస్తే చెన్నైలోని హోటలు వాళ్ళు ఆయన సెల్ మరిచి వెళ్ళి చెప్పారనీ వాపోయి, మన్నించమని ఒకటికి రెండుసార్లు అర్థించి మరీ వెళ్ళాడు. అతను వెళ్ళిన తర్వాత రాజశేఖరం ఓ గ్లాసుడు వేడిపాలు తాగి, ఓ అరగంట సేపు ఏదో పుస్తకం చదివి నిద్రకుపక్రమించాడు.

క్రితంరోజు సాయంత్రం ఆ బస్సులో ప్రయాణం చేసిన ఎంతమంది యువకులు రాజశేఖరాన్ని గుర్తించారో, గుర్తించినా కిమ్మనకుండా ఎందుకు మౌనంగా ఉండిపోయారో, వాళ్ళలో ఎంతమందిని రాజశేఖరం గుర్తించగలిగాడో చెప్పడం కష్టం. అయితే అక్షర క్రమంలో యాభై రెండవ అభ్యర్థిగా లోపల అడుగు పెట్టిన రామారావు వురఫ్ రామాన్ని రాజశేఖరం గుర్తుపట్టాడు. బల్లకావల కూర్చున్న అయిదుగురిలోనూ, మధ్యగా రివాల్వింగ్ ఛైర్‌లో కూర్చున్న రాజశేఖరాన్ని చూడగానే రామారావుకి ఒక్కసారిగా ఒళ్ళంతా చెమటలు పట్టేశాయి. మొహం వివర్ణమైపోయింది. స్థాణువులా నిలబడిపోయిన రామారావుని చూస్తూ రాజశేఖరం సౌమ్యంగానే అన్నాడు. ''వచ్చి కూర్చోండి''

రామారావు తన్ను తాను స్వాధీనంలోకి తెచ్చుకొని, నిబ్బరంగానే కుర్చీలో కూర్చున్నాడు. పేరూ, ఊరూ, విద్యార్హతలూ, యితర వివరాలూ రాజశేఖరం స్వయంగా అడిగి, రామారావుని స్థిమితపరిచి, ''యిప్పుడు మీరు ప్రశ్నలడగండి'' అని పక్కవారితో అన్నాడు. ఆ నలుగురు సభ్యులూ ఒకొక్కరూ నాలుగేసి ప్రశ్నల చొప్పున రామారావుని అడిగారు. ''తెలుసును'' అనుకొన్నవాటికి తెలిసినట్టుగానూ, తెలియనివాటికి తెలియదనీ ఖచ్చితంగా సమాధానాలు చెప్పాడు.




చివరగా రాజశేఖరం కరెంటు ఎఫైర్స్ మీద రెండు మూడు ప్రశ్నలడిగిన తర్వాత రామారావు ఓ రకమైన సంతృప్తితో, అయినా మనసులో పేరుకొన్న ఓ రకమైన భయంతో బయటపడ్డాడు. ఆరోజుకి రామారావే ఆఖరి అభ్యర్థి.

ఇంటర్వ్యూలు పూర్తవడానికి మరుసటి రోజంతా కూడా పట్టింది. మూడోరోజు ఉదయం యింటర్వ్యూ బోర్డు సమావేశమైంది. ఉన్న పోస్టులు ఎనిమిది. ఇంటర్వ్యూలకి హాజరైన అభ్యర్థుల సంఖ్య నూట పది. రాజశేఖరం ప్రముఖుల వద్దనుంచి వచ్చిన సిఫారసు ఉత్తరాల్నీ, టెలిఫోను కాల్స్‌నీ పూర్తిగా నిర్లక్ష్యం చేసి, నియమాల ప్రకారం అభ్యర్థుల ప్రతిభను బేరీజు వేసే కార్యక్రమం చేబట్టడంతో మిగిలిన నలుగురు సభ్యులూ కాస్త యిరకాటంలో పడ్డ విషయం వాస్తవం. రాజశేఖరానికి చెప్పే సాహసం వారికి లేదు. కావల్సిన కనీస విద్యార్హతలకీ, శ్రేణులకీ-అదనపు విద్యార్హతలకీ, శ్రేణులకీ-పూర్వానుభవానికీ నిర్ధారితమైన మార్కులు. ఆయా సభ్యులు వేసిన ప్రశ్నలకి వచ్చిన సమాధానాన్ని బట్టి ఆయా సభ్యులు ఇచ్చిన మార్కులు. రాజశేఖరం సమక్షంలో, పర్యవేక్షణలో పట్టిక తయారుచేయబడింది.

ఆ రక్షణ పథకంలో కేటాయించబడిన మూడు ఉద్యోగాలకి, వచ్చిన మార్కులస్థాయిని బట్టి ముగ్గురి ఎంపిక జరిగిపోయింది. నలుగురు అభ్యర్థులకు 65 నుండి 62 వరకూ మార్కులు లభించాయి. వాళ్ళు గట్టెక్కేశారు. రామారావుకీ, మరో అభ్యర్థి కనకారావుకీ అరవై మార్కులొచ్చి సమానంగా నిలబడ్డారు. రాజశేఖరం ఆలోచనలో పడ్డాడు. చదువుతో సంస్కారాన్నీ, కార్యదక్షతనీ ముడిపెట్టడం అన్నివేళలా సాధ్యం కాదు. అదొక అపసవ్యమైన భావన, నమ్మిక. ఈ కారణంగానే మనిషి అసలు వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యడం దుర్లభమౌతుంది. పరీక్షల్లో మార్కులు రావడం, యింటర్వ్యూలలో బాగా సమాధానాలు చెప్పడం లాంటి కొలమానాలు ఎంపికకు ఆధారాలైనా, అలా ఎంపిక కాబడ్డ వారందరూ సంస్థ పురోగతికి దోహదమవుతారని ఎక్కడా లేదు. రాజశేఖరం యిన్నేళ్ళ అనుభవంలో ఎన్నో సాక్ష్యాలు.

అందరికీ ఒకే న్యాయం వర్తించాలన్న యిదితో రామారావు దురుసుగా ప్రవర్తించాడు. నిజం తెల్సిన తర్వాత ఒక్క క్షమార్పణలే చెప్పి వెళ్ళిపోకుండా, ''బస్సుకేమైనా అయితే మీరెలా బయటపడ్తారు?'' అని మందలించి, దగ్గరుండి చేయూతనందించాడు. రామారావు వ్యక్తిత్వాన్ని అంచనా వెయ్యడంలో యింతకంటే మంచి అనుభవం ఏం కావాలి? సంస్థకి యిటువంటి వ్యక్తుల అవసరం ఎంతైనా ఉంది.

ఇంటర్వ్యూ బోర్డు అధ్యక్షుడిగా, తన చేతిలో సందర్భానుసారంగా, వివేకయుక్తంగా యివ్వదగ్గ రెండు మార్కులున్నాయి. అందులో ఒక్క మార్కు వేసినా రామారావు గట్టెక్కేస్తాడు. రామారావుకి ఆ ఒక్క మార్కూ వెయ్యకపోతే, నియమాల ప్రకారం ఆ పోస్టు కనకారావుకివ్వాలి. ఎందుకంటే కనకారావు రామారావుకంటే రెండు నెలలు పెద్ద. ఆటో, టాక్సీల సమ్మె జరగడం, తను బస్సులో రావడం, రామారావుతో భేటీ జరగడం-అంతా యాదృచ్ఛికం. అలా జరగని పక్షంలో అందరిలాగా రామారావూ ఓ అభ్యర్థి మాత్రమే. ఒకే ఒక్క పోస్టుకీ లేదా ఆఖరి పోస్టుకి మార్కులు సమంగా వచ్చిన అభ్యర్థులుంటే వయసుకి ప్రాధాన్యత నివ్వడమనేది ఓ నియమంగా మారిపోయింది.

ఇప్పుడు ఒక్క మార్కు రామారావుకి వేసి ఎంపిక చేస్తే, ''ఆయనపట్ల నేనెంత దురుసుగా ప్రవర్తించినా మనసులో పెట్టుకోకుండా ఎంపిక చేశార''న్న కృతజ్ఞతా భావం రామారావులో కలుగుతుంది. ఎంపిక కాని పక్షంలో ''తప్పు ఒప్పుకొని, క్షమించమని అర్థించి, ఆ తర్వాత ఎంతో సహాయం చేసినా, యింటర్వ్యూలో పైకి తీపి కబుర్లు చెప్పి, కసి మనసులో ఉంచుకొన్నాడ''న్న ద్వేషభావం రామారావు పెంచుకోవచ్చు. రామారావు తన విద్యార్హతల గురించీ, యింటర్వ్యూలోని పెర్‌ఫార్మెన్స్ గురించీ ఆలోచించక, తన వైఫల్యానికి కారణం రాజశేఖరమే అనుకొనే అవకాశం లేకపోలేదు.

కీర్తికాంక్ష, అపార్థభయం, సంస్థకి న్యాయం, కనకారావు వయసు, కనకారావుకి న్యాయం, యాదృచ్ఛిక సంఘటనలకి ప్రాముఖ్యత, సంస్థ నిర్దేశించిన నియమాల పాలన, సంస్థ తనకిచ్చిన అధికార వినియోగం-యివన్నీ రాజశేఖరం మెదడులో సుడిగుండాల్లా తిరుగుతూ ఉంటే, కుడిచేతి వేళ్ళమధ్యనున్న కలం గాలిలోనే కదుల్తోంది. నీతిపథంలో ఆలోచించే వాళ్ళకే ధర్మ సంకటాలన్నీ!